ప్రజాశక్తి
బుధవారం 13 నవంబర్ 2024 5
శ్రీ సత్యసాయి

కాలవ శ్రీనివాసులుకు విప్

ప్రజాశక్తి-అనంతపురం

రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు విప్ పదవి వరించింది. కూటమి పార్టీ సభ్యుల సమావేశం అనంతరం విప్ పదవులపై నిర్ణయం జరిగింది. అందులో అనంతపురం జిల్లా నుంచి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు విప్ పదవి వరించింది. 2014లోనూ ఆయన చీఫ్‌విప్‌గా పని చేశారు. అనంతరం మంత్రి పదవి వరించింది. ఈసారి మంత్రివర్గంలో చోటు ఉంటుందని భావించారు. కాని జిల్లాలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక మంత్రిగా నియమితులయ్యారు. దీంతో ఆయనకు అవకాశం లభించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవి వస్తుందని ప్రచారం సాగింది. కాని అదీ వరించలేదు. ఇప్పుడు విప్ పదవుల్లో చోటు లభించింది.

పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు

మట్టిలోపోసిన రూ.643.91 కోట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులన్నీ పడకేశాయి. ఆధునీకరణ పనులన్నీ మధ్యలోనే ఆగిపోయాయి. ఈ పనుల పురోగతి కోసం పెట్టిన వందల కోట్లు మట్టిలో పోసినట్టయ్యాయి. ఈ బడ్జెట్‌లోనూ ఆగిన పనులకు నిధులు కేటాయింపులు జరగలేదు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కూడా ఇబ్బందికరంగా మారుతుండటం గమనార్హం. మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఆధునీకరణ కలిపి మొత్తం రూ.1202.248 కోట్లతో పనులు చేపట్టగా రూ.643.91 కోట్లు ఖర్చు చేశారు. ఇంత ఖర్చు చేశాక పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో సాగునీటి నిర్వహణ కూడా ఇబ్బందికరంగా మారింది.

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణను 2008లో చేపట్టారు. రూ.458.42 కోట్లతో చేపట్టారు. 80 కిలోమీటర్ల మేర కాలువ ఆధునీకరణ చేపట్టాల్సి ఉంది. దీని కోసం రూ.309.78 కోట్లు ఖర్చు చేశారు. అయితే 2019లో వైసిపి ప్రభుత్వమెచ్చాక పనులను రద్దు చేసింది. ఐదేళ్లపాటు పనిచేయడానికి వీల్లేకుండా ఉంది. ఈ పనులను నిలిపివేయడంతో సాగునీటి నిర్వహణ కూడా ఇబ్బందికరంగా మారింది. మిడ్‌పెన్నార్ డ్యాప్ నుంచి వెళ్లే దక్షిణ కాలువ ఆధునీకరణ రూ.509.158 కోట్లు వ్యయంతో చేపట్టారు. ఈ కాలువ ఆధునీకరణ కోసం రూ.158.13 కోట్లు ఖర్చు పెట్టారు. ఈ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ పనులను చేపట్టేందుకు గడిచిన ఐదేళ్లు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇప్పుడు ఈ పనులను ఏమి చేస్తారన్నది చూడాల్సి ఉంది. ఇక గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు రూ.234 కోట్లు వ్యయంతో పనులు చేపట్టారు. దీనికి రూ.176 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ తరువాత ఆగిపోయాయి. ఇలా మొత్తం రూ.643 కోట్లు ఖర్చు పెట్టారు. తక్కిన రూ.558 కోట్లు పనులు ఆగిపోయాయి.

నిర్వహణ అస్తవ్యస్తం

ప్రాజెక్టుల పనులను అర్ధాంతరంగా మధ్యలో ఆపివేయడంతో కాలువల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. నీటి నిర్వహణ కూడా కొన్నిసార్లు ఇబ్బందికరంగా మారింది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ అయితే మరింత దయనీయంగా మారింది. కనీస మరమ్మత్తులకైనా రూ.35 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనావేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కాని నిధుల కేటాయింపులు బడ్జెట్‌లో చేపట్టలేదు. ఈ నిధుల్లేకుండా పనులు ముందుకు సాగుతాయా లేదా అన్నది చూడాల్సి ఉంది.

ధర్నాలో పాల్గొన్న నాయకులు, పేదలు

అర్హులందరికీ ఇళ్లపట్టాలివ్వాలి

ధర్నాలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణంలో అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం పేదలతో కలిసి రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తొలుత ఇందిరాపార్క్ నుండి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి అనంతరం రెవెన్యూ కార్యాలయం వద్ద బైటాయించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటి పట్టాలు లేని పేదవారితో కలిసి సిపిఎం నాయకులు భూ పోరాటం నిర్వహించడం జరిగిందన్నారు. అయితే పోలీసులు రెవెన్యూ అధికారుల నుండి పేదలకు ఎలాంటి నోటీసులు అందకపోయినా దౌర్జన్యం చేస్తూ భూ పోరాటాన్ని భగ్నం చేయడం తగదన్నారు. ఎన్నో ఏళ్లుగా పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని వినతి పత్రాలు అందజేస్తున్నా ఇప్పటి వరకు ఇంటి పట్టాలు ఇవ్వలేదన్నారు. దరఖాస్తు చేసుకుని అర్హత ఉన్న వారందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. వెంటనే ఈ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాము, రమణ, బాబావలి, రాజప్ప, రామకృష్ణ, ఇళ్లస్థలాల పోరాట కమిటీ నాయకులు జ్యోతమ్మ, లక్ష్మీదేవి, సరస్వతి, నర్సింతాజ్, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సమాజ హితానికి

సిఎస్ఆర్ నిధులు వినియోగించాలి

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సమాజానికి ఉపయోగపడే విధంగా పరిశ్రమల యాజమాన్యాలు సిఎస్ఆర్ నిధులను ఉపయోగించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. పరిశ్రమల యాజమాన్యం తమ లాభాలలో కొంత శాతం సమాజ అభివృద్ధి కోసం వినియోగించాలన్నారు. నిధుల వినియోగం పై ప్రణాళికాబద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాల్లో ఆయా ప్రాంతాలలో నిధుల వినియోగంపై కలెక్టర్ అనుమతిని తీసుకోవాలన్నారు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విధిగా పాటించాలన్నారు. వచ్చే నెలలో నిర్వహించే సమావేశానికి కచ్చితంగా ఆర్‌డిఎ పీడీ, ఎల్ఎల్, ఐసిడిఎస్ పీడీ, హిందూపురం కమర్షియల్ ట్యాక్స్ అధికారి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఒను కలెక్టర్ ఆదేశించారు. విపత్తులను ఎదుర్కొనేందుకు అత్యవసర చర్యలు నిర్వహణకు సిఎస్ఆర్ నిధుల అవసరమని అందువల్ల కొంత మేర బడ్జెట్ కూడా డిపాజిట్ చేయాలని అన్నారు. అంతకుమునుపు పవర్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలెక్టర్ కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, పరిశ్రమల మేనేజర్ నాగరాజు, డిపిఒ సమిత, డిఇఒ క్రిష్టప్ప, జడ్పి సీఈవో వెంకటసుబ్బయ్య, డిఎంహెచ్ఒ మంజువాణి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యలు పరిష్కరిస్తాం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పోలీసు సంక్షేమంలో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లాలోని ఎఆర్ సిబ్బంది సమస్యలను తొందర్లోనే పరిష్కరించే విధంగా చూస్తామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న హామీ ఇచ్చారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్"దర్బార్" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. ఈ దర్బార్ లో క్యాజువల్ లీవు, ట్రాన్స్‌ఫర్, టిఎలు, అలవెన్సులు, ఎఆర్, స్పెషల్ పార్టీ పోలీసుల బందోబస్తులు, జిపిఎఫ్ లోన్, మెడికల్ బిల్లులు, సినియార్టీ లిస్టు, ప్రమోషన్, బదిలీలు తదితర సమస్యల గురించి జిల్లా ఎస్పీకి సిబ్బంది విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ వారి సమస్యలను విని తన పరిధిలో ఉన్న సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తానని, మేజర్ గా ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కూడా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సిబ్బందికి ఎస్పీ చేతుల మీదుగా షూస్, మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు ,అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఎఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్, ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐలు వలి, మహేష్ , డిసిఆర్‌బి సి ఐ శ్రీనివాసులు, ఆర్ ఎస్ఐలు ఎఆర్ సిబ్బంది, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు .

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం : కారుణ్య నియామకం కింద హోంగార్డ్ కుటుంబానికి ఉద్యోగం ఉత్తర్వులు అందజేసి ఆ కుటుంబానికి 5 వేల రూపాయల విలువైన చెక్కును జిల్లా ఎస్పీ వి రత్న చేతులమీదుగా మంగళవారం అందజేశారు. కొత్తచెరువు మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన హోంగార్డ్ చెన్నప్ప ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈనేపథ్యంలో చెన్నప్ప భార్య చంద్రకళకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఉత్తర్వుల నియామక పత్రాన్ని జిల్లా ఎస్పీ వి.రత్న మంగళవారం అందజేశారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు భార్యకు 5 లక్షల రూపాయల విలువైన చెక్కును అందజేశారు. బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు , ఏఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఏవో సుజాత, అర్ఐ వలి, మహేష్, ఎఆర్ఆర్ ఎస్ఐ షౌకత్ అలీ, షామీర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతిగృహాన్ని పున: ప్రారంభించండి

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని బొంతలపల్లిలో 1983 వ సంవత్సరంలో ఏర్పాటుచేసిన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తిరిగి ప్రారంభించాలని మాజీ జడ్పిటిసి రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొంతలపల్లి చుట్టుపక్కల గ్రామాలలో అనేకమంది ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులు ఉన్నారని, వారు బొంతలపల్లి గ్రామంలో పదవ తరగతి వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాఠశాలలో చదువుకుంటున్నారని చెప్పారు. అప్పటి ప్రభుత్వం బొంతలపల్లిలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేసిందని అది 2004 వరకుఅనేకమంది విద్యార్థులు చదువుకోడానికి ఉపయోగపడిందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో బొంతలపల్లి చుట్టుపక్కల గ్రామాల పరిధిలోని విద్యార్థులు చదువుకోవడానికి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా రవాణా సౌకర్యం లేక చాలామంది పేద విద్యార్థులు తమ చదువును మధ్యలోనే వదిలేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో బొంతలపల్లిలో హాస్టల్‌ను పునరుద్ధరిస్తే ఎంతోమంది పేద విద్యార్థులు చదువుకోడానికి అవకాశం ఉంటుందన్నారు. బొంతలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదర నాయుడుమాట్లాడుతూ గ్రామానికి చుట్టుపక్కల ఉన్న అనేక మంది విద్యార్థులు రవాణా సౌకర్యం లేక చదువుకోడానికి ఇబ్బంది పడుతున్నారని బొంతలపల్లిలో హాస్టల్ ఏర్పాటు చేస్తే ఎంతోమంది విద్యార్థులకు ఉపయోగం ఉంటుందని ఈ దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేయాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

కదిరిలో కరపత్రాలు పంచుతున్న నాయకులు

ధర్మవరంలో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పుట్టపర్తిలో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం తగదని సిపిఎం నాయకులు అన్నారు. కదిరి పట్టణంలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. నవంబర్ 8 నుండి 14 వరకు సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 27, 28, 33, వార్డులలో ప్రజా పోరు నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి జి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ఉచిత ఇసుక, విద్యుత్ ఛార్జీలు తదితర అంశాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఎండగట్టారు. ప్రజాపోరు లో భాగంగా ఈనెల 14వ తేదీన మండల కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా లో ప్రజలందరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, బాబ్జాన్, బాలకృష్ణ, ఫాజిల్, గంగరాజు, జిలాన్, కృష్ణానాయక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు నిర్వహిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. ప్రజాపోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పట్టణంలో సిపిఎం కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయినా ప్రజాసమస్యల పరిష్కారంలో చొరవ చూపడం లేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలకు సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. నిత్యావసర ధరలు, విద్యుత్ ట్రూఆఫ్ ఛార్జీలు, నిరుద్యోగ భృతి, ఉచిత ఇసుక తదితర విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, రైతు సంఘం నాయకులు మారుతి, సిఐటియు నాయకులు జెవి. రమణ, ఎస్‌హెచ్ బాషా, అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరులో సిపిఎం నాయకులు

పుట్టపర్తి రూరల్: సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజాపోరులో భాగంగా ఈనెల 14న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు ప్రజాపోరు పోస్టరును మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సిఐటియు నాయకులు ఈఎస్ వెంకటేష్, సాంబశివ, వ్యవసాయ కార్మిక నాయకులు వెంకటేష్, సిద్దు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలకు కావస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నాన్చుడు ధోరణి అవలంభిస్తోందని విమర్శించారు. గతంలో ఇసుక ఐదువేలరూపాయలకే లభిస్తూ ఉండేదని ఇప్పుడు అది 8వేల రూపాయలు అవుతోందని విమర్శించారు. మహిళల పట్ల రోజురోజుకు పెరిగిపోతున్న అఘాయిత్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సూపర్ సెక్స్ పథకాలకు బడ్జెట్లో స్థానం లేదని మరి వాటిని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.

అనధికార లేఅవుట్‌పై చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

మండలంలోని హరియాన్ చెరువు గ్రామంలోని అనధికార లేఅవుట్‌పై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. 'అనధికార లే అవుట్' అన్న శీర్షికన ఈ నెల 7 వ తేదీన ప్రజాశక్తి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో శివ శంకరప్ప, ఈవోఆర్డీ అశోక్ కుమార్ నాయక్ స్పందించారు. ఈ మేరకు వారి ఆదేశాల మేరకు న్యామద్దెల గ్రామ పంచాయతీ కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, రమణ హరియాన్ చెరువు గ్రామంలో అనధికారకంగా ఏర్పాటు చేసిన లే అవుట్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ అనధికార లేఅవుట్‌లో ప్రజలు క్రయ, విక్రయాలు జరపకూడదని ఆ బోర్డులో హెచ్చరించారు. ఈ లే అవుట్ కు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని, ప్రజలు ఎవ్వరూ కొనుగోలు చేయవద్దని ఆ బోర్డులో హెచ్చరించారు. దీంతో 'మేము లే అవుట్ వేస్తే, మమ్ములను ఎవ్వరు ప్రశ్నిస్తారు ? మాకు అడ్డు తగిలేది ఎవ్వరు.? మాకు వివిధ శాఖల ప్రభుత్వ అధికారుల అనుమతులు అనవసరం' అన్న ధైర్యంతో అనధికార లే అవుట్ ను వేసి, ప్లాట్లను అమ్ముకొని సొమ్ము చేసుకుందామనుకున్న వారికి దిక్కుతోచని స్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా ఈ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అనధికార లేఅవుట్ వేసి విక్రయించిన వారిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు మరింత ముందుకు వెళ్లి, ఈ అనధికార లే అవుట్ విషయాన్ని జిల్లా కేంద్రంలోని ఆహుడా అధికారులకు నివేదిక ద్వారా తెలియచేయాలని, అలాగే మాయ మాటలతో ప్రజలను నమ్మించి, ప్లాట్లను అమ్మిన వారికి నోటీసులు ఇచ్చి చర్యలు చేపట్టాలని హరియాన్ చెరువు గ్రామస్తులు కోరుతున్నారు.

రాత్రి సమయంలో అడవిలో ఆగిపోయిన బస్సు

ఆగిన ఆర్టీసీ బస్సు

ఇబ్బందుల్లో ప్రయాణికులు

ప్రజాశక్తి - రొద్దం

రొద్దం నుంచి హిందూపురానికి వెళ్లే ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో మండలంలోని చిన్నమంతూరు సమీపంలో మరమ్మతుకు గురై ఆగిపోయింది. రాత్రి వేళలో రబ్బర్ బ్యాండ్ రిపేరుతో నిలిచిపోయింది. దీంతో చిన్నమంతూరు, చెరుకూరు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు రాత్రి 8 గంటల సమయంలో నానా అవస్థలు పడుతూ గ్రామాలకు చేరుకున్నారు. బస్సు రిపేరు విషయాన్ని డ్రైవర్, కండక్టరు హిందూపురం డిపోకు తెలియజేశారు. అయితే వారు వచ్చేవరకు డ్రైవర్, కండక్టర్ ఇద్దరు మాత్రమే బస్సుకు కాపలాగా నిలిచిపోవాల్సి వచ్చింది. దీంతో వారు కూడా బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఇద్దరూ కూడా అక్కడ మగవారే ఉండడంతో ఎలాంటి సమస్య లేకపోయింది. అలా కాకుండా మహిళా కండక్టర్ ఈ స్థితిలో ఉంటే పరిస్థితి ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'పురం' విద్యార్థులు

ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు, అధికారులు

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీలలో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. బాలురు అండర్ - 14 విభాగంలో జాన్ విక్టర్, మహమ్మద్, జై శోభన్, కైఫ్, లవన్ కుమార్, సాజిద్ ఖాన్, సుదీప్ రెడ్డి,అండర్ - 14 బాలికల విభాగంలో డింబు శ్రీ, అన్విత, యాసిని, మంజుశ్రీ, గౌరీ, అనన్య, సాయి హిమనీ, యాలిని, జ్ఞాన చరిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అదే విధంగా బాలికల అండర్ - 17 విభాగంలో భావన, వర్షిత, నాగ వర్షిత, దీపిక, శరణ్య, సమీరా రెడ్డి, హాసిని రెడ్డి, నేహా, అండర్ - 17 బాలర విభాగంలో మహీధర్ నాయక్, నూర్ మొహమ్మద్, వేణు, తేజ, అకీబ్ , రాహుల్, కైఫ్, లక్ష్మీనరసింహారెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభా విద్యార్థులను ఎస్‌జిఎఫ్ కార్యదర్శి మురార్జీ యాదవ్, ఫిజికల్ డైరెక్టర్ సురేష్, ప్రధానోపాధ్యాయురాలు సుధామణి, కార్య నిర్వహణ కార్యదర్శి ఫైరోజ్, పీడీ నాగమణి, కరాటే మాస్టర్లు జనార్దన్ రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, షేక్షావలి, షాకీర్, ఇనాయత్, శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

ముస్లిముల శాంతియుత దీక్ష

వ్యక్తి పై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుల్ల వద్ద రైల్వే బ్రిడ్జి ఏర్పాటులో కోల్పోనున్న జామియా మసీదు, ఈద్గా,ఖబరస్థాన్ పరిరక్షణకు కుటాగుల్ల మైనార్టీ వర్గాలు శాంతియుత దీక్షను చేపట్టాయి. ఈ మేరకు వారు మాట్లాడుతూ 400 సంవత్సరాల నుండి కుటాగుళ్ళ లో నివసిస్తున్న ముస్లిం సోదరులు మసీదు ఈద్గా లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారన్నారు. గ్రామ ముస్లింలు, జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఈద్గా సంరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం రోడ్డు విస్తరణలో ఈద్గాకు సంబంధించిన భూమి కోల్పోవడం జరుగుతోందన్నారు. ఈద్గా కి ఎటువంటి సంబంధంలేని కుటాగుల్ల దర్గా పీఠాధిపతి కెఎస్ఎస్ ఉబేదుల్లా అనే వ్యక్తి ప్రభుత్వం నుండి వచ్చే పరిహారాన్ని కాజేసేందుకు కుట్ర పన్నాడని ఆరోపించారు. అందుకు నిరసనగా వేలాది మంది ముస్లింలు శాంతియుతంగా దీక్ష చేస్తున్నట్లు తెలిపారు.దర్గా సంరక్షణ చేసుకుంటామన్నారు. గ్రామ పెద్దలతో స్థానిక ప్రజలతో బతిమాలి హైదరాబాద్ నుండి అరువుగా వచ్చిన వ్యక్తి ఇప్పుడు ఈద్గా పరిహారం దోచుకునేందుకు కుట్ర పన్నాడని ఆయనపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

దీక్షలో పాల్గొన్న ముస్లిం, మైనార్టీలు

జాతీయ విద్యా దినోత్సవం

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

పట్టణంలోని దర్గాపేటలో గల జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల లో మంగళవారం అల్ కౌసర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మైనార్టీ వెల్ఫేర్ డే, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న ఫజల్ కరీం, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూడోసారి ఎన్నికైన సుధాకర్‌ను సంస్థ అధ్యక్షుడు సయ్యద్ అఫ్జల్ హుస్సేన్ సన్మానించారు. అనంతరం భారతదేశ ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి స్వాతంత్ర్య సమరయోధులు భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 137వ, జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు సయ్యద్ బర్కతుల్లా, సయ్యద్ షఫీ,ఉస్మాం భాష చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటసాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని భాజయపాలెం, రత్నగిరి గొల్ల హట్టి గ్రామాలలో వ్యవసాయాధికారులు పంటసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు పకృతి వ్యవసాయంపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ జయరాం, జడ్‌బిఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీగా వరలక్ష్మి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీగా వరలక్ష్మిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో పనిచేస్తున్న ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి వ్యక్తిగత అవసరాల దృష్ట్యా నెలరోజులపాటు మెడికల్ లీవ్‌లో వెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వరలక్ష్మికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఒడి చెరువు సిడిపిఒగా కొనసాగుతున్న వరలక్ష్మి బాధ్యతలు స్వీకరించింది.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - తలుపుల

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, జన జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఓబులరెడ్డి పల్లిలో విద్యార్థులకు హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన జాగృతి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, ఉపాధ్యాయులు, జన జాగృతి సిబ్బంది ప్యారి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - మడకశిర

గ్రామాల్లో చేపట్టే సిసి రోడ్ల నిర్మాణంలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలపై సబ్ డివిజన్ పరిధిలోని 5 మండలాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో అవగాహన కల్పించారు. అనంతపురము జిల్లా విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీరు కె.మాలికార్జున మూర్తి, పెనుకొండ ఉప కార్యనిర్వాహక ఇంజనీరు నాగేశ్వర్, ఏఇలు శ్రీనివాస రెడ్డి, రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. సిసి రహదారుల నిర్మాణాలు గుత్తేదారులతో ఏ మాత్రం రాజీ లేకుండా నాణ్యతగా నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ఉప కార్య నిర్వాహక ఇంజనీరు యం. వెంకటేశులు, ఎఇ బి.నాగన్న, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందజేయాలి

ప్రజాశక్తి - మడకశిర

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్డీఏ భరోసా పథకం ద్వారా రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం క్రింద 20 వేల రూపాయలు ఇవ్వాలని సిపిఐ , రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీనివాసులు, కాటమయ్య, దాబా రామకృష్ణ తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలోని నాలుగవ వార్డులో గల సంత మార్కెట్ వీధి, పులేరు రోడ్డు తదితర ప్రాంతాల్లో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ ఆధ్వర్యంలో పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి ఎఫ్ పిషావ్, డీలర్ షేక్ అజ్మతుల్లా ఆధ్వర్యంలో మంగళవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి బీర వేణుగోపాల్ రాయల్, కమ్మల రఘునాథ్ రెడ్డి, నాగమణి, శ్రీరాములు, సోము, మణి, హరిప్రసాద్, చైతన్య, ఉస్మాన్, సోమశేఖర్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి గ్రామ పంచాయతీ రాందాస్ తండాలో టిడిపి నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం తండా లో నిర్వహించారు.టీడీపీ నాయకులు కుపేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ నాయక్, పెదబాబు నాయక్, శ్రావణ్ నాయక్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లలో సభ్యత్వ నమోదులో నాయకులు

నిర్వాసితులకు పరిహారం అందించాలి

కమిషనర్ ఉత్తర్వుల మేరకు ప్యాకేజీ తక్షణం చెల్లించాలి
సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలో వ్యకాసం నాయకులు

అధికారులకు సమస్యను వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పాలసముద్రం వద్ద కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నాసన్ , బెల్ భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీను కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం తక్షణం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వ్యకాసం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఎ. ఛాంబర్ వద్ద బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ జిల్లాలోని సంబంధిత అధికారులు నిర్వాసితుల సమస్యలు పట్టించుకోకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో హైకోర్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపుల కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ ఉత్తర్వులను ఆర్డీవో అమలు చేయకపోవడంతో గత్యంతరం లేక ఈనెల 5న నిర్వాసితులందరూ విజయవాడలో కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారన్నారు. స్పందించిన కమిషనర్ ప్యాకేజీ చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని చెప్పారు. నిర్వాసితులకు న్యాయం చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన విషయం తెలుసుకున్న ఆర్డీవో ఆనంద్ కుమార్ నాయకులతో ఫోన్లో మాట్లాడారు. నిర్వాసితుల డిమాండ్ మేరకు రెండు రోజుల్లో సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సమస్య పరిష్కార చర్యలు తీసుకోకపోతే ఆర్డీవో కార్యాలయంలో బైఠాయిస్తామని నాయకులు హెచ్చరించారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏవోకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత , నారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, భూనిర్వాసితులు గంగప్ప, వెంకట లక్ష్మమ్మ, అచ్చమ్మ, వెంకటరాముడు, సన్న ఆంజనేయులు, వెంకటరామిరెడ్డి, రమీజమ్మ, రమేష్‌తో పాటు 200 మంది నిర్వాసితులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే చిరుత మృతి

ప్రజాశక్తి - మడకశిర

టిఎన్ఎస్ఎఫ్ మురళీబాబు

నిత్యం రద్దీగా ఉన్న ప్రాంతంలో చిరుత మృతిచెందిన ఘటనలో అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం ఉందని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళి బాబు ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మడకశిర చుట్టు పక్కల కొండలు గుట్టలు ఉండడం తో వన్యప్రాణుల సంచారం ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో జన సంచారం ఉన్న పరిసర ప్రాంతాల్లోకి వన్యప్రాణులు వెళ్తుండా, ప్రమాదం బారిన పడకుండా రక్షణ కల్పించాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులకు ఉండాలన్నారు. వన్యప్రాణులు గ్రామీణ ప్రాంతాల్లో కి చొరబడి ప్రజలపై దాడి చేయక ముందే అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నారాయణకు ఉత్తమ అధ్యాపకుడి అవార్డు

ప్రజాశక్తి కదిరి అర్బన్

అవార్డు అందుకుంటున్న ఎం. నారాయణ

కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తూ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగ అధిపతి గా పనిచేస్తున్న డాక్టర్ ఎం నారాయణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపకుడి అవార్డు అందుకున్నారు. ఈనెల 11న విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నాయుడు చేతుల మీదుగా ఈయన ఉత్తమ అధ్యాపకుడి అవార్డును అందుకున్నారు. డాక్టర్ ఎం నారాయణకు ఉత్తమ అధ్యాపకుడి అవార్డు వరించడంతో పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, కదిరి నియోజకవర్గ ప్రజలు అభినందనలు తెలిపారు.

'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గత ప్రభుత్వ హయాంలో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల మేరకు ఆశాల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల, ఆర్డీవోల కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆశా వర్కర్ల యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ మంజువాణికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, మాట్లాడుతూ ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని అనేక రూపాల్లో వినతి పత్రాలు సమర్పించామన్నారు. అయితే అప్పటి ప్రభుత్వం ఎలాంటి సమస్యలను పరిష్కరించకుండా కాలం దాటవేసిందని వాటి పరిష్కారం కొరకే ఈ నెల 18న కలెక్టరేట్ల ఎదురుగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అధికారులు ,లీడర్లు ఆశ వర్కర్లపై కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్నారని వీటిని నిరసిస్తూ కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం చేపడుతున్నామని ఈ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం సత్య సాయి జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు సాంబశివ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు గత ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుని వారి సమస్యలను పరిష్కరించకుండా దాటవేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్న నేటికీ వారి సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు మహాలక్ష్మి, హనుమక్క ,అంజనమ్మ, రాజేశ్వరి ,రజియా, గాయత్రి , సహాయ కార్యదర్శి గంగులమ్మ సిద్ధ తదితరులు పాల్గొన్నారు.

కప్పట్రాళ్ళ సుశీలమ్మను
వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ పదవి నుంచి తప్పించాలి

ప్రజాశక్తి - హిందూపురం

కప్పట్రాళ్ళ సుశీలమ్మ అలియాస్ బొజ్జమ్మను రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ పదవి నుండి తొలగించాలని స్థానిక వాల్మీకి నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం సత్య సాయి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ చిరు వాల్మీకి, హిందూపురం పార్లమెంట్ యువజన సంఘం అధ్యక్షుడు నవీన్ కుమార్ తదితరులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ ఫెడరేషన్ చైర్మన్ గా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోనే విధంగా ఉన్నతాధికారుల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఐంటర్వ్యూలో సుశీలమ్మ తాము వాల్మీకులు కాదని అంగీకరించిందని అన్నారు. తాము ఏకలేళ్ళు అని తమను కప్పట్రాళ్ళ గ్రామంలో దొరలు అంటారని చెప్పడం జరిగిందన్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర వాల్మీకి నేతలు సైతం గుర్తించారన్నారు. తాము వాల్మీకి బోయలు కాదని చెప్పినా కూడా ప్రభుత్వం ఆమెకు రాష్ట్రంలో 50 లక్షల జనాభా కలిగిన వాల్మీకి బోయ జాతిపై ఎలా పెద్దరికం ఇస్తారని ప్రశ్నించారు. సమస్యల లోపం కారణంగా ఇచ్చిన పదవి నుండి ఆమెని తొలగించి పార్టీ కోసం శాయశక్తులా కృషిచేసిన వాల్మీకులకు కట్టబెట్టాలని కోరారు. లేనిపక్షంలో తెలుగుదేశం పార్టీకి లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారుల ద్వారా నివేదిక తెప్పించుకొని సుశీలమ్మను పదవి నుండి తొలగించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం వాల్మీకి సంఘం పెద్దలు విజయ్ కృష్ణ, పోతేమాన్ రామకృష్ణ , కాలవ రాము, విశ్వనాథ్ ఎస్ఎల్ లోకేష్, బైలర్ కొండ, లక్ష్మీనారాయణ, ఉమేష్, నాగభూషణ, సూర్యనారాయణ, మహేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి -బత్తలపల్లి

మండలంలోని వివిధ గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రత్యేకంగా. గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గరిశలపల్లిలో సర్పంచ్ మారెడ్డి పద్మావతి అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో ఎంపిడిఓ నరసింహనాయుడు, ఏవో ఓబిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ షణ్ముఖరావ్, ఈవోఆర్డీ క్రిష్ణప్పలతో పాటు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : మండల పరిధిలోని బిజిహళ్లి పంచాయతీలో మంగళవారం రెవెన్యూ సదస్సును తహశీల్దార్ షేక్షావలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు రైతులు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, తెలుగు యువత తాలూకా అధ్యక్షులు బాలకృష్ణ, ఆదేప్ప మంజునాథ్, వీఆర్వోలు చిరంజీవి, సూర్య ప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి జెకె ఈరన్న పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని సుబ్బరావుపేటలో మంగళవారం డీటీ జగన్నాథ్ ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

లేపాక్షి : మండలం పరిధిలోని సిరివరం గ్రామంలో సర్పంచ్ నేత్రవతి అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రమీలమ్మ,సీనియర్ అసిస్టెంట్ వన్నూరప్ప, మండల సర్వేయర్ సుమిత్రమ్మ, గ్రామ రెవెన్యూ అధికారి రమేష్, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వందశాతం అక్షరాస్యత సాధించాలి

ప్రజాశక్తి - గుడిబండ

మండల వ్యాప్తంగా వెలుగు ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ మహిళా సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులను వంద శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపీడీవో గంగాధర్ మహిళా సంఘ సభ్యులకు సూచించారు. స్థానిక శ్రీనిధి కార్యాలయంలో మంగళవారం నిరక్షరాస్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఎపిఎం తిప్పన్న, సీసీలు,అనిమేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ వివిధ మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులుగా ఉన్న వారిని గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకొని మహిళా సంఘ సభ్యులు పనిచేయాలన్నారు. ఎపిఎం తిప్పన్న మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటికే మహిళా సంఘాల్లో 900 మందిని నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందని చెప్పారు. మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయడానికి 10 మందికి ఒకరిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం సంఘాల్లో ఉన్న అని మేటర్లకు కూడా ఆయా గ్రామాల్లో ఉన్న సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వందశాతం అక్షరాస్యులుగా చేయాలని సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు శ్రీధర్, రామాంజనేయులు, నరసింహమూర్తి, అంజనప్ప, సన్నప్ప, అకౌంటెంట్, ఆశా, అనిమేటర్లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : తాడిమర్రి వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై మంగళవారం శిక్షణ జరిగింది. గ్రామీణ ప్రాంతాలలో నిరక్షరాస్యతను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని అధికారులు తెలిపారు. వాలంటీర్లు సేవాభావంతో పనిచేసే తాడిమర్రి మండల అక్షరాస్యత శాతం పెంచడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఎపిఎం,ఏపిడీవో రంగారావు, సీసీలు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాసు జయంతి గుర్తింపుపై హర్షం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

భక్త కనకదాసు జయంతిని ప్రభుత్వం గుర్తించినందుకు జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని హనుమాన్ సర్కిల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకదాసు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం పండుగ జరుపుకోవాలని తీసుకున్న నిర్ణయం పట్ల కురుబలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈనెల 18న జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కురుబలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశాని ఆదినారాయణ, డాక్టర్ శంకర్ నారాయణ, క్రిష్టప్ప, రమణ, గంగాద్రి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గా శ్రీనివాసులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గా కొత్తచెరువు మండలం గోరంట్లపల్లికి చెందిన బులగొండ శ్రీనివాసులను అధిష్టానం ఎంపిక చేసిందని నాయకులు తెలిపారు. సత్యసాయి జిల్లా తెలుగు నాడు విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యల పరిష్కారానికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశారన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం ఈ పదవిని కట్టబెట్టిందన్నారు. తనకు ఈ పదవి రావటానికి సహకరించిన మంత్రి సవితమ్మ, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డికి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

నిందితుడికి జీవితఖైదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గోరంట్ల మండల పరిధిలోని నార్సింపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ అనే ఫోక్స్ కేసు నిందితుడికి జీవితకాలం జైలు శిక్ష పడింది. పెనుగొండ జడ్జి రాజ్యలక్ష్మి సాక్షులను విచారించి నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు వెయ్యిరూపాయల జరిమానా విధించారు. బాధితులకు పది లక్షల రూపాయలు పరిహారం అందే విధంగా తీర్పు ఇచ్చారు. గోరంట్ల మండలం నార్సింపల్లిలో 2020 సంవత్సరం నవంబర్ 18వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న ఐదేళ్ల బాలికను నిందితుడు మాయమాటలు చెప్పి తన ఇంటిలోని పిలుచుకుని పోయి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి గోరంట్ల సిఐ జయనాయక్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి అనంతపురం దిశ మహిళ డిఎస్పీ శ్రీనివాసులు, కేసును దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు లో జడ్జి రాజ్యలక్ష్మి 10 మంది సాక్షులను విచారించి నేరం రుజువైనందున మంగళవారం తీర్పును ఇచ్చారు. ఈ కేసులో నిందితుడికి నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసు వారి తరఫున కేసును ఈశ్వరమ్మ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు.

పుట్టపర్తిలో చోరీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని ప్రశాంతి గ్రామంలో సోమవారం రాత్రి ఓ ఇంటిలో చోరీ జరిగింది. ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడి వివరాల మేరకు కప్పల బండ పంచాయతీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్ జానకి రామయ్య కాలనీలో నివాసం ఉంటున్న శ్రీధర్ ఇంటికి ఉన్న తాళాలను దుండగులు సోమవారం రాత్రి పగలగొట్టి ఇంటిలో చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువా తలుపులు తెరిచి అందులో ఉన్న పది తులాల బంగారం, ఒక కిలో వెండి, ఐదువేల రూపాయలు నగదు దోచుకు వెళ్లారు. ఇంటి యజమాని శ్రీధర్ తన పిల్లల వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లి రాత్రి ఇంటికి రాకపోవడంతో ఈ దొంగతనం జరిగింది. మంగళవారం ఉదయం ఇంటికి రాగానే ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించిన బాధితుడు పుట్టపర్తి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన ఇంటిని పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న పరిశీలించారు. కాలనీలోని సిసి కెమెరాలు ఉంచిన ప్రదేశాల్లో దర్యాప్తు చేసి నిందితులను గుర్తిస్తామనిశ్రీధర్ తెలిపారు. ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ సంఘటన జరిగినందున ప్రశాంతి గ్రామం ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రోజురోజుకు దొంగతనాలు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం, జమ్ములబండ గ్రామానికి చెందిన భూతరాజు అనే వ్యక్తి నుంచి 22 కర్నాటక మద్యం పాకెట్లను ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ ప్రసాద్ రావు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమంగా కర్నాటక మద్యం అమ్మినట్లయితే వారిపై కఠిన చర్యలు చేపడతామని ఈ సందర్భంగా సిఐ ప్రసాద్ రావు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ద్విచక్రవాహనానికి పంది అడ్డురావటంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. చిలమత్తూరు వైపు నుండి హిందూపురం వైపు వెళుతున్న ద్విచక్రవాహనానికి పంది అడ్డు రావడంతో ద్విచక్రవాహనంలో వెళుతున్న సురేష్, మల్లేశ్వర గాయపడ్డారు. గాయపడిన వారిని అంబులెన్స్ సాయంతో హిందూపురం తరలించారు.

రొద్దం వద్ద జరిగిన ప్రమాదంలో మరో ఇద్దరికి ...

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని పెనుగొండ పావుగడ ప్రధాన రహదారిలో సుబ్బరాయప్ప గారి కొట్టాల, పెద్దకోడిపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం మండలంలోని పెద్దపల్లి గ్రామనుండి ద్విచక్రవాహనంలో రొద్దం వస్తున్న రొద్దకంపల్లి గ్రామవాసులను మండలంలోని పెద్ద కోడిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న అశోక్, నాగప్పకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు వెళ్లిపోవటంతో తాము ఆరా తీసి నిందితులను గుర్తించినట్లు ఎస్ఐ చెప్పారు.

మద్యం విక్రేతల బైండోవర్

ప్రజాశక్తి - హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నాటక మద్యం విక్రేతలను తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ లక్ష్మి దుర్గయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల హిందూపూర్, పరిగి, చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో కర్నాటక మద్యం అమ్మకం, వ్యాపారం చేస్తున్న 26 మంది పాత నిందితులను మంగళవారం తహశీల్దార్ వద్ద ప్రవేశపెట్టినట్లు తెలిపారు. తహశీల్దార్ వెంకటేష్ ఒక్కొక్కరికి రూ..లక్ష పూచీకత్తు మీద, ఒక సంవత్సర కాలానికి బైండోవర్ చేశారన్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం ఎన్‌జిఒ కాలనీలో నివాసమున్న రమణమ్మ అనే వృద్ధురాలి మనవరాలు 14 సంవత్సరాల పూర్ణచంద్రిక అదృశ్యమైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన మనవరాలితో కలిసి పట్టణంలని రైల్వే స్టేషన్ రోడ్ లో ఉన్న మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసేందుకు వెళ్లగా పూర్ణ చంద్రిక అక్కడ అదృశ్యమైందని ఫిర్యాదులో పేర్కొంది. తన మనవరాలితో బెంగళూరికి చెందిన రాజు అనే వ్యక్తి చనువుగా ఉండేవాడనితనే తన మనవరాలిని తీసుకొని వెళ్లి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు.

మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేసి వారి నుండి మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ లక్ష్మి దుర్గయ్య తెలిపారు. కొట్నూరు రైల్వే గేట్ సమీపంలో మారుతి అనే వ్యక్తి నుండి 40 హైవార్డ్ విస్కీ కర్నాటక పాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. అదే విధంగా హిందూపురం మండలం కగ్గల్లుకు చెందిన మూర్తి అనే వ్యక్తి నుండి 46 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసులో నమోదు చేసి రిమాండ్ పంపినట్లు సిఐ చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్లునరసింహ, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సురేష్, సుధాకర్రెడ్డి, శివ కుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కమ్మవారిపల్లి పంచాయతీ హమాలీ కోటర్స్‌కు చెందిన బెల్లారి రమణ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ హరి ప్రసాద్ స్పందించి వారి అనుచరుల ద్వారా తనవంతుగా మృతుడి దహన సంస్కారాల కోసం రూ. 10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, సూరినేని కిరణ్, రవి, బాబ్జాన్, ముబారక్ పాల్గొన్నారు.

ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సోమశేఖర్‌ను ముస్లిం మైనార్టీ సోదరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జామియా మసీద్, మదీనా మసీదుల ముతవల్లి సులేమాన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎల్ఎస్ సుభాన్, మౌలా, గుండు సాబ్ తదితరులు ఎస్ఐను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అనంతరం జామియా మదీనా మసీదుల నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ విషయమై నెలకొన్న సమస్యలను ఎస్ఐ దృష్టికి కమిటీ సభ్యులు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఖాసింవలి, మహమ్మద్ వలి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

హిందూపురంలో మాట్లాడుతున్న ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ విద్యారమ

శిక్షణలో పాల్గొన్న నల్లచెరువు మండల అధికారులు

ప్రజాశక్తి - హిందూపురం

గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలను పకడ్బందీగా తయారు చేయాలని శ్రీకాళహస్తి ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ విద్యారమ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరస్వతి అధ్యక్షతన గ్రామపంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికల తయారీకి సంబంధించి శిక్షణ తరగతులు జరిగాయి. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, వివో లీడర్లు పాల్గొన్నారు.

రొద్దం : గ్రామ పంచాయతీల అభివృద్ధిపై పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఎంపిడిఒ రామ్ కుమార్ కోర్సు డైరెక్టరుగా వ్యవహరించారు.మండల విస్తరణ అధికారి గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శులు ముత్యాల్నాయుడు, రాజశేఖర్ శిక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని గ్రామ సభలు నిర్వహించి ప్రజలందరి భాగస్వామ్యంతో జీపీడీపీ తయారు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి :మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, వివో లీడర్లకు ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో మమతా దేవి, ఈవోఆర్డీ లక్ష్మీనరసమ్మ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని గ్రామసభ నిర్వహించాలని సూచించారు. గ్రామసభలో పంచాయతీకి అవసరమైన పనులు నెరవేర్చే విధంగా తీర్మానాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో పరిపాలన అధికారి ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 సంవత్సరాలకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయుటకు మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ లు ప్రతి గ్రామానికి వెళ్లి అక్కడ మౌళిక వసతులు గురించి ప్రజలతో వివరాలు తెలుసుకొని వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. అదేవిధంగా బుధవారం నిర్వహించే రెండో రోజు శిక్షణ కార్యక్రమాలకి మండలం లోని పంచాయతీ సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసిలు హాజరుకావాలని తెలిపారు.

గాండ్లపెంట : 2025 26 సంవత్సరానికి గ్రామాల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలన్న విషయంపై రెండు రోజులు పాటు అన్ని శాఖ అధికారులకు ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఈవోఆర్డీ సునీత తెలిపారు. మొదటి రోజు నిర్వహించిన శిక్షణలో అధికారులు మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు అభివృద్ధి ప్రణాళికలు అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంగా తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సయ్యద్ భాష, వసుంధర, భవాని, మదన్ మోహన్ నాయక్, మానస, సచివాలయ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

బత్తలపల్లి : గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎంపీడీవో నరసింహనాయుడు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌టిజిఎస్‌ఎ కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025-26పై ఒక రోజు మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు హాజరయ్యారు.

చిలమత్తూరు : గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు.ఎంపిడిఒ రమణమూర్తి, ఇఒఆర్‌డి ప్రభుదాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: గ్రామ పంచాయతీ అభివృద్ధిపై మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రఘునాథ్ గుప్తా మాట్లాడుతూ మండలంలోని 13 పంచాయతీల్లో ఇంతవరకు జరిగిన అభివృద్ధి, జరగాల్సిన అభివృద్ధిపై ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుని ఒక ప్లాన్ తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ రామచంద్రారెడ్డి, సిడిపిఒ గంగరత్నమ్మ, ఏపీవో మంజుల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెనుకొండ : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఎంపిడిఒ నరేష్‌కృష్ణ కోర్సు డైరెక్టరుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని, గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం స్పెషలాఫీసర్ పద్మావతి, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు, వెలుగు గ్రామైక్య సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు , మండల స్థాయి అధికారులకు, మహిళా సంఘాల వివో లీడర్లకు 2025-2026 సంవత్సరానికి గ్రామ/ మండల అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ భాస్కర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్‌పి.కుంట మండల శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్, జిల్లా పరిషత్, కేజీబీవీ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలను సేకరించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్ మాట్లాడుతూ కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ పాఠశాలలకు వార్డెన్ పోస్టును మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతా శ్రీనివాసులు, రమణారెడ్డి, ఆనంద్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో 'మంగళకర' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీకష్ణదేవరాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ కోల్గేట్ గ్రూప్ సి వాలీబాల్ పోటీలలో మంగళకర డిగ్రీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 8 ,9 ,10 తేదీలలో గుంతకల్లు ఎస్ఎస్‌జిఎస్ కళాశాలలో జరిగిన గ్రూప్ సి వాలీబాల్ పోటీలలో మంగళకర జట్టు విజేతగా నిలించింది. ఈ సందర్భంగా మంగళకర విద్యాసంస్థల కరస్పాండెంట్ సురేష్ కుమార్, ఎఒ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ రమేష్ బాబు, అధ్యాపకులు ప్రతిభా విద్యార్థులను అభినందించారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో వీరు పాల్గొననున్నారు.

వడ్డెర కార్పొరేషన్ పాలక మండలిని నియమించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

మాట్లాడుతున్న సంపంగి గోవర్ధన్

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేసిన విధంగా వడ్డెర కులస్తులకు కార్పొరేషన్ చైర్మన్ నియమించాలని రాష్ట్ర నాయకులు సంపంగి గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు నలభై లక్షల జనాభా ఉన్న వడ్డెర్లకు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మరియు పాలక మండలి డైరెక్టర్లను ఇంతవరకూ నియమించక పోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇటీవలబీసీ కులాలకు కార్పొరేషన్ల చైర్మన్లను పాలక మండలిని నియమించిందన్నారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన వడ్డెర్లకు ఇంతవరకూ పాలక మండలిని నియమించక పోవడం వడ్డెర్లను కలవర పెడుతోందని వాపోయారు. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవి రాయలసీమ వారికే కేటాయించాలని, గత ప్రభుత్వం గుంటూరుకు చెందిన వారికి కేటాయించారు కనుక ఇప్పుడు ఎక్కువ జనాభా కలిగిన రాయలసీమకు ఈ పదవి దక్కాలని కోరారు. రాష్ట్రబడ్జెట్లో బీసీ సబ్ ప్లాన్‌కు ముప్పై తొమ్మిది వేల కోట్ల రూపాయలు కేటాయించిన నిధుల్లో నుండి వడ్డెర కార్పొరేషన్ కి కనీసం వెయ్యి కోట్ల రూపాయలైనా కేటాయించాలని డిమాండ్ చేశారు.

'బడ్జెట్లో మైనార్టీలకు పెద్దపీట'

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేసిందని రాష్ట్ర టిడిపి మైనార్టీ విభాగం కార్యదర్శి ఎస్. మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలు అధిక శాతం మంది కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి ఓట్లు వేశారన్నారు. కూటమి ప్రవేశపెట్టిన బడ్జెట్లో రూ.4376 కోట్లు కేటాయించడం పట్ల ముస్లిం మైనార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. బడ్జెట్లో మైనార్టీలకు సముచిత స్థానం కల్పించడం పట్ల సిఎం చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

బుక్కపట్నం : ముస్లిం మైనార్టీల అభివద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని మైనార్టీ సంఘం నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మైనార్టీ సంక్షేమం కోసం 4370 కోట్ల రూపాయలను ప్రవేశపెట్టడంతో హర్షం వ్యక్తం చేసి,కేక్ కట్ చేసిసంబరాలు జరుపుకున్నారు. అనంతరం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ముస్లింలకు భారీ మొత్తంలో నిధులు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జామియా మసీద్ ముతవల్లి సయ్యద్‌బాషా, నాయకులు ఖలీల్, షామీర్ భాషా, వాజిద్, వెంకటరాముడు, మాజీ ఎంపీపీ బాలు, సంజీవ రాయుడు, సుధీర్, మంజు, సతీష్, బాబా తదితరులు పాల్గొన్నారు.

వీధిదీపాల ఏర్పాటు

ప్రజాశక్తి - మడకశిర

మండలంలోని కల్లుమర్రి పంచాయతీలో సర్పంచి గంగమ్మ నాగరాజు ఆధ్వర్యంలో వీధిదీపాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి నరసన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్ చేతుల మీదుగా వారోత్సవాలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల కార్యాలయాలలో ఈనెల 14న బాలల దినోత్సవంతో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జయరాం, రామాంజనమ్మ, జయసింహరాజు, ఖాజాబుద్దీన్, వెంకటరమణప్ప, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: కొత్తచెరువు లోని శాఖ గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కే జయరాం తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, మాదక దవ్యాలపై అవగాహన,16న గ్రంథాలయ ఉద్యమాలలో పాల్గొన్న ప్రముఖుల గురించి వివరించడం జరుగుతుందన్నారు. 17న కవి సమ్మేళనాలు, రచయితల సందేశాలు, 18వ తేదీ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, క్విజ్ అండ్ క్రీడా పోటీలు, 19న మహిళలకు వివిధ కార్యక్రమాల పోటీలు, రంగవల్లిల పోటీలు, 20వ తేదీ డిజిటల్

వారోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్నకలెక్టర్, తదితరులు

గ్రంథాలయాల పై విద్యార్థులకు అవగాహన ముగింపు ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.